క్లుప్తంగా

ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోండి


మాట్లాడుతున్న ఎల్‌వీ రెడ్డి

ఒంగోలు సిటీ: ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలని రెడ్డి సంఘం మ్యారేజీ మీడియేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్‌వీ రెడ్డి కోరారు. బుధవారం ఒంగోలు నగరంలో ఎల్‌వీ రెడ్డి అధ్యక్షతన అసోసియేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. మ్యారేజీ బ్యూరోలలో చాలా మంది పేదవాళ్లు ఉన్నారని, వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఎల్‌వీ రెడ్డి తెలిపారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు యు.సుబ్బారెడ్డి, నల్లమల అప్పిరెడ్డి, డి.హరినాథరెడ్డి, కే నాగిరెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న జంగమ ఆరామక్షేత్రం ప్రారంభం

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక బీసీ కులాల ఆరామ క్షేత్ర సముదాయంలో నిర్మించిన జంగమ ఆరామ క్షేత్రాన్ని ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు టి.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెట్టిచాకిరి నుంచి బాలికను కాపాడిన డీసీపీఓ

ఒంగోలు సిటీ: వెట్టిచాకిరి నుంచి బాలికను డీసీపీఓ కాపాడిన సంఘటన బుధవారం ఒంగోలులోని కరుణకాలనీలో చోటుచేసుకుంది. డీసీపీఓ దినేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలులోని కరుణ కాలనీలో నివసిస్తున్న 13 సంవత్సరాల బాలికను ఆమె తల్లి రమాదేవి చిత్రహింసలకు గురిచేస్తోందని స్థానికుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, చైర్మన్ రామాంజనేయులు, జిల్లా బాలల సంక్షేమ కమిటీ వారికి తెలిసింది. కుమార్తెను స్కూలుకు పంపించకుండా ఇంట్లో పని చేయిస్తూ తనకి ఆహారం అందించకుండా ఇబ్బందులు గురిచేస్తోందని తెలియడంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్ డీసీపీఓ సిబ్బంది, సోషల్ వర్కర్లు వీరాంజనేయులు, సమాధానం, అవుట్ రెడ్ వర్కర్ శామ్యూల్ రాజ్‌తో వెళ్లి విచారణ చేశారు. సిబ్బంది, పోలీస్ వారితో కలిసి అంగన్‌వాడీ వర్కర్ వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించారు. సీడబ్ల్యూసీ బెంచ్ ముందు హాజరుపరిచి, రక్షణ, సంరక్షణ నిమిత్తం బాలసదనంలో ఆశ్రయం కల్పించారు.

ఫ్లెక్సీలు తొలగించిన వారిపై కేసు నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుజన్ మాదిగ

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఫ్లెక్సీలు తొలగించిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కె.సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో జవహర్ అభినందన సభ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అగ్రకులస్తులు ధ్వంసం చేశారన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌కే ఇలా అవమానం జరగడం దారుణమైన విషయమని అన్నారు. అధికార కూటమి పార్టీలలో దళితులకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. తక్షణమే పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వెంగళరావు, జి.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌పై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ఒంగోలు సిటీ: ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రత్యర్థి దేశ తీవ్రవాదుల దాడిని భారతదేశ సైన్యం ఎలా ఎదుర్కొందో ఎన్‌సీసీ క్యాడెట్లకు 34ఏ ఎన్‌సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్ అవగాహన కల్పించారు. బుధవారం ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆపరేషన్ సింధూర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి పాల్గొన్నారు. జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? పెహల్గామ్‌లో అటాక్స్ ఎలా జరిగాయి.? ఆ తర్వాత ఆపరేషన్ సింధూర్‌ని ఎలా నిర్వహించారు? మన వాళ్లు పాకిస్తాన్ సైనికులను ఎలా ఎదుర్కొన్నారు? తదితర అంశాలపై క్యాడెట్లకు కల్నల్ మోహన్ అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు విపత్కర పరిస్థితుల్లో డిఫెన్స్‌లో భాగస్వాములు కావాలంటే ఇలాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్విస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు క్విస్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలకు చెందిన 400 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి


ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

● ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి కోరారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ఇన్చార్జి ఎంపీడీఓ రాఘవేంద్ర మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రధాన సమస్యలైన తాగునీరు, పారిశుధ్యం వంటివాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మండలంలోని మద్దిరాలపాడు గ్రామం పారిశుధ్య పనుల్లో బాగా వెనకబడి ఉందన్నారు. క్లాప్‌మిత్రను ఏర్పాటు చేయడంలో సర్పంచ్ అనూరాధ సముఖత చూపకపోవడంతో అటువంటి సర్పంచ్లను సస్పెండ్ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. తద్వారా వారికి సర్పంచ్ పదవి పోతుందని ఎంపీడీఓ అన్నారు. తొలుత శాఖల వారీగా సమావేశంలో చర్చించారు. పీఆర్ ఏఈ వీరాంజనేయులు మాట్లాడుతూ రూ.4.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ గతంలో 1140 గృహాలు మంజూరు కాగా, 973 పూర్తయి 175 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈదుమూడి గ్రామంలో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు ఉన్నందున పంచాయతీకి నీటి సరఫరాలో ఇబ్బందిగా ఉందని, ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని గ్రామ సర్పంచ్ బోలే లక్ష్మి అంజనేయులు, ఎంపీటీసీ మున్నంగి రమ్య, సెక్రటరీ రంగారెడ్డిలు ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు. చవటపాలెం, అమ్మనబ్రోలు గ్రామాల్లో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉందని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించాలని ఆయా గ్రామాల ఎంపీటీసీలు ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల చైర్మన్లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి


పాఠశాల ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న డీఈవో కిరణ్ కుమార్

● డీఈవో కిరణ్‌కుమార్

కొత్తపట్నం: పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు ఉంటే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన పాఠశాల ముఖ ద్వారాన్ని బుధవారం డీఈవో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య అధ్యక్షత వహించగా, డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో చదివి వెళ్లిపోయిన తర్వాత కూడా పాఠశాలను మర్చిపోకుండా సేవచేయడానికి పూనుకోవడం మంచి లక్షణమని అభినందించారు. సమాజానికి మంచి చేస్తే తిరిగి మనకు మేలు జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో 1973–78 మధ్యలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ముఖద్వారాన్ని రెండు లక్షల రూపాయలతో నిర్మించారని అభినందించారు. పూర్వ విద్యార్థి దాచూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 1985లో సర్పంచ్‌గా ఎంపికై ఈతముక్కలలోని ప్రతి కాలనీలో పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. 1995 తర్వాత వాయల మోహన్‌రావు ఈతముక్కలలో అభివృద్ధి చేశారన్నారు. మరో పూర్వ విద్యార్థి ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్ కె.జానకిరామయ్య మాట్లాడుతూ ఐదు నెలల క్రితం జరిగిన 1973–78 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హెచ్‌ఎం కోరిక మేరకు పాఠశాలలో ముఖద్వారం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని, దానికి అనుగుణంగా ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులను శాలువాలతో హెచ్‌ఎం సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం, ఒంగోలు ఎంఈవోలు తులసికుమారి, టి.పద్మావతి, టి.కిషోర్, బాపిరెడ్డి, జాలిరెడ్డి, ఎం.హరిప్రసాద్‌రావు, ఎం.వి జయలక్ష్మి, ఎస్‌వీవీ నారాయణరెడ్డి, జ్వాలాంబ, హరినాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలి


కొత్తపట్నం : పొలంలో పంటలను పరిశీలిస్తున్న ఏడీ రమేష్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి రైతూ ఈ పంట నమోదు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని సూచించారు. బుధవారం సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న అన్ని పంటలను ఈ పంటలో నమోదు చేయించుకుంటేనే వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.బాలసుబ్రహ్మణ్యం, డి.సాయికృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పావని

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మోడల్ మండలంగా కొత్తపట్నం ఉందని, నూరు శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలని వ్యవసాయ శాఖ ఏడీ బి.రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పొలాల్లో పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రైతులు తమకున్న పొలంలో కనీసం అరెకరాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలని కోరారు. రాబోయే తరాలు పూర్తిగా ప్రకృతి వ్యవసాయానికి అలవాటుపడాలని సూచించారు. విత్తనశుద్ధి చేసుకోవడం వలన పంటలకు ఆశించే పురుగు, తెగుళ్లను కొంతమేర తగ్గించవచ్చన్నారు. విత్తనశుద్ధి ద్వారా మొలకశాతం కూడా పెరుగుతుందన్నారు. రైతులు సాగుచేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని కోరారు. కౌలు రైతులు కౌలు కార్డు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు, ఏఈవో సీహెచ్ అజయ్‌కుమార్, వీఏఏ శ్రావణ్, ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జి రెడ్డెప్ప, మండల ట్రైనర్ నరసింహులు, ఎంఎంటీఎల్ వికాస్, మార్కెటింగ్ శాఖ నుంచి కిషోర్, వీఎఫ్ఏ స్వర్ణలత, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో పారిశుధ్యంపై సీడీఎంఏ అధికారులు అసంతృప్తిగా ఉన్నారని, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలోని సచివాలయాల శానిటరీ సెక్రటరీలతో బుధవారం కమిషనర్ సమీక్షించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది సక్రమంగా పనిచేయటం లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడీఎంఏ ప్రతి వారం నిర్వహించే రివ్యూ సమావేశంలో శానిటేషన్ గురించి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతిరోజూ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఉన్నతాధికారులు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నారు. ఇకపై ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, కాలువల క్లీనింగ్ తప్పకుండా చేయించాలని శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలకు ఆదేశాలిచ్చారు. సక్రమంగా పనిచేయని వారి గురించి తనకు తెలియజేయాలని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రామ్‌భూపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు పిచ్చయ్య, బాబీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మద్దిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో 33 కేవీ మద్దిపాడు నూతన లైన్ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెల్లంపల్లి, కొలచనకోట, గుండ్లాపల్లి, బూరేపల్లి, గడియాపూడి, గార్లపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్ మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చీమకుర్తి రూరల్: మద్దిపాడు గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 10కిపైగా బహుళ జాతీయ కంపెనీలతో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగి పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 నుంచి రూ.25,000 వరకు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి సారె వేడుకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ఆషాడమాస వేడుకల్లో భాగంగా సంతనూతలపాడులో వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీ అమ్మవారికి అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మొదట సంతనూతలపాడు పురవీధుల్లో ఆర్యవైశ్య మహిళలు వాసవీ అమ్మవారితో సారె, పసుపు, కుంకుమలు, గాజులు, వడపప్పులతో మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి సారె బహూకరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ చంద్రావతి, గౌరవాధ్యక్షురాలు జి.సులోచన, సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్రప్రసాదరావు, వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి శేషారావు, గౌరవాధ్యక్షుడు పాదర్తి గిరి, ఉపాధ్యక్షుడు వేమా శ్రీను, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పమిడి సుధాకర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు


శాకంబరీదేవిగా పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీదేవి

ఒంగోలు మెట్రో: ఆషాడమాసం పూజల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అమ్మవార్ల ఆలయాలలో మూలమూర్తులను శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శనం చేసుకుని పూజలు చేశారు. ఒంగోలు లాయర్ పేట షిర్డీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారిని అలంకరించగా, భక్తులు దర్శనం చేసుకున్నారు. ముందుగా నిర్వాహకులు ఆలయాన్ని పుష్పాలతో చక్కగా అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


విద్యార్థులకు చట్టాల గురించి వివరిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య

చీమకుర్తి రూరల్: మండలంలో బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, లింగ వివక్షత అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం న్యాయ పరిరక్షణ అధికారి బి.రత్నప్రసాదు సూచించారు. బుధవారం బండ్లమూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ఇవాంజలిన్ అధ్యక్షత వహించగా, ఎస్ఐ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బాలల చట్టాలు, రోడ్డు భద్రతా ప్రమాణాలు, బాలల హెల్ప్‌లైన్ 1098 ద్వారా జరిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారిణి శ్రీలక్ష్మి, హైస్కూల్ హెడ్ మాస్టర్ భాస్కర్‌శాస్త్రి, విశ్వభారతి, శామ్యూల్‌రాజ్, పి.నాగలక్ష్మి, శైలజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ


మద్దిరాలపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీవో వెంకట నాయుడు

నాగులుప్పలపాడు: మండలంలోని మద్దిరాలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

వేములపాడుకు రెగ్యులర్‌గా బస్సు నడపాలి


ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావుకు అర్జీ అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

● ఆర్టీసీ డీఎంకు వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

ఒంగోలు సిటీ: సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సును రెగ్యులర్‌గా నడపాలని కోరుతూ ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అర్జీ అందజేశారు. ఆ గ్రామానికి చెందిన బోయళ్ల వెంగళరావు, అనమలకుర్తి వెంకటరత్నం, ఎల్.నాగేశ్వరరావు, ఎ.నరసయ్య మాట్లాడుతూ ప్రస్తుతం బస్సు తిరుగుతున్నప్పటికీ.. ఏ రోజు వస్తుందో, ఏ రోజు రాదో తెలియడం లేదన్నారు. శివారు గ్రామం అయినందున ఆటోలు కూడా రావడం లేదన్నారు. టూ వీలర్ లేనివారు 4 కిలోమీటర్లు నడిచి చిలకపాడు వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తమ గ్రామంలో ప్రాథమిక వైద్యశాల ఉందని నాలుగైదు గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు వస్తారని, 25 మంది అందులో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామం నుంచి హైస్కూల్‌కు విద్యార్థులు వస్తారన్నారు. 25 కిలోమీటర్లున్న ఒంగోలు నగరానికి వచ్చి రోజువారీ పనిచేసుకుని వచ్చేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ గమనంలో ఉంచుకుని రెగ్యులర్‌గా బస్ నడపాలని కోరారు. ప్రత్యేకంగా మధ్యాహ్నం 1.30కు ఒక ట్రిప్ కావాలని కోరారు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లు బస్సు లేనందున 4.30 వరకు అక్కడే ఉండాల్సి వస్తోందన్నారు. అక్కడ వారికి టీ, టిఫిన్, మీల్స్ అందుబాటులో ఉండదని, ఇంటికి వెళ్లి తినటానికి చాలా సమయం వేచి ఉండాలని అన్నారు. ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు అర్జీని పరిశీలించి రెగ్యులర్‌గా బస్సు నడుపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, సంతనూతలపాడు మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘ నూతన కమిటీ ఎంపిక

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): వ్యవసాయ కార్మిక సంఘ సంతనూతలపాడు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని బీ మాచవరం గ్రామంలో రెండు రోజుల పాటు వ్యవసాయ కార్మిక సంఘ తొమ్మిదో మహాసభలు నిర్వహించారు. బుధవారం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా మద్దిరాల సుశీల, కార్యదర్శిగా అన్నవరపు శేషారావు, గౌరవాధ్యక్షునిగా ఈదర సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా అద్దంకి భరత్, మరికొందరు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాహన పత్రాలు సక్రమంగా ఉండాలి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ

నాగులుప్పలపాడు: ప్రతి వాహనదారుడు వారి వాహనాలకు తప్పకుండా సరైన పత్రాలు ఉండేలా చూసుకోవాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ సూచించారు. బుధవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డుపై తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించడంతో పాటు ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనంతరం పలు వాహనాల పత్రాలను పరిశీలించారు. సచివాలయ మహిళా సిబ్బందికి పాఠశాలల్లో బాలికలకు నిర్వహించే అవగాహన కార్యక్రమాలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.